క్లుప్తంగా

పల్లికొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



హాజరైన దుకాణాల యజమానులు

నాగలాపురం: మండలంలోని శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 18 నుంచి 28వ తేదీ వరకు జరగబోవు మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, ఊరేగింపు, వివిధ రకాల పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, ఆలయానికి రంగులు, స్టేజీ ఏర్పాట్లు, ప్రత్యేక నైవేద్య పూజలు నిర్వహించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి లత ఆధ్వర్యంలో శుక్రవారం టెండరు ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ దుకాణాల యజమానులు వివిధ ప్రాంతాల నుంచి డీడీల రూపంలో ధరావత్తు చెల్లించి సీల్డ్ కొటేషన్లను వేశారు. పైన తెలిపిన కొటేషన్ దాఖలు చేసేందుకు జనవరి 6వ తేదీన సీల్డ్ టెండర్లు తెరవనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మావతి

బుచ్చినాయుడుకండ్రిగ : స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తలారివెట్టు, వెస్టువరత్తూరు గ్రామాల్లో ఉచితంగా పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈనెల 23వ తేదీన ఆర్.అనంతపురం గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి దివాకర్, వైద్యులు విద్యాసాగర్, పద్మావతి, చైతన్య భాను, సీహెచ్ఓ వెంకటేశులు, సర్పంచులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నరసింహవర్మ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నరసింహవర్మ మాట్లాడుతూ గణితంలో ప్రావీణ్యం పొందితేనే విద్యార్థులు రాణించగలరన్నారు. రామానుజన్ చిన్నవయసులోనే మరణించినా గణిత శాస్త్రానికి సంబంధించి ఎంతో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగారామ్, అధ్యాపకులు సుబ్బారెడ్డి, బాపనయ్య, సునీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

వరదయ్యపాళెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి పార్లమెంటులో కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై అంబేడ్కర్ సంఘం మండల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. గురువారం సాయంత్రం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో నిరసన తెలుపుతూ స్థానిక పుర వీధుల్లో మీదుగా ర్యాలీ నిర్వహించారు. తక్షణమే అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు చిన్నా, డేవిడ్, వెంకటేష్, రామసుబ్బయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

బస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం



నాగలాపురం : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని 80 ఏళ్ల వృద్ధుడి మృతదేహం కనిపించింది. గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు వీఆర్‌ఓ నాగభూషణం, పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికంగా విచారించి మృతి చెందిన వృద్ధుడిని యాచకుడిగా గుర్తించారు. అనంతరం వృద్ధుడి మృతదేహాన్ని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు దహన సంస్కారాలు చేశారు.

e-తరం.. ప్రియమైన నువ్వు లేఖ





నాడు ఏ కబురైనా.. ఎక్కడ నుంచి ఎక్కడికి..ఎవరికి పంపాలన్నా ఉత్తరమే సాధనం. శుభమైనా..అశుభమైనా.. ఉద్యోగ, వ్యాపార, విద్యారంగాల్లో సమాచారాన్ని చేరవేయాలన్నా లేఖలే ఆధారం. అవి మోసుకొచ్చే విషయాలు.. భావాలు.. కబుర్లు ఎన్నో.. ఇదంతా గతం. వర్తమాన తరాలకు ఉత్తరాల మాధుర్యం తెలియదు. ఈ క్రమంలో తపాలా శాఖ 'ఢాయ్ ఆఖర్' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉత్తరాల ద్వారా వ్యాస రచన పోటీలకు కార్యాచరణ రూపొందించింది. లేఖలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.

- తపాలా శాఖ ఆధ్వర్యంలో 'ఢాయ్ ఆఖర్'
- పిల్లలు.. పెద్దలకు వ్యాస రచనల పోటీలు
- ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్ కవర్‌లోనే పంపేలా నిబంధనలు
- విజేతలకు జాతీయ, రాష్ట్రస్థాయిలో నగదు బహుమతులు
- ఉత్తరాలకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పోస్టల్ అడుగులు
- జనవరి 31 తుది గడువు

నారాయణవనం: అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పండు ముసలి నుంచి ప్రీకేజీ పిల్లల వరకు సామాజిక మాధ్యమాలపై ఆధారపడుతున్నారు. సెల్‌ఫోన్ల ద్వారా బంధువులతో నేరుగా మాట్లాడుతూ వారి యోగక్షేమాలు విచారిస్తున్నారు. కంపెనీలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సైతం ఈ మెయిళ్లు, వాట్సాప్‌లో అన్ని కార్యకలాపాలు నడుస్తున్నాయి. గూగుల్ మీట్, జూమ్ మీట్‌లలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. విద్యాలయాల్లో డిజిటలైజేషన్ విప్లవం ఊపందుకున్న తరుణంలో విద్యార్థులు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లను వినియోగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తరాలు రాయడం, ప్రత్యుత్తరాలు తీసుకోవడం కనుమరుగవుతోంది. దీంతో తపాలా శాఖ ఆలస్యంగా అయినా మేల్కొంది. ఉత్తరాల విలువ, ప్రాముఖ్యత, విశేషాలను విద్యార్థులకు తెలియజేయాలనే సదుద్దేశంతో సరికొత్త ఆలోచనకు తెరతీసింది.

బహుమతులు

రాష్ట్రస్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి 3 స్థానాలు నిలిచిన వారికి వరుసగా రూ. 25 వేలు, రూ.10 వేలు,రూ.5 వేలు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారిని జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు అందజేస్తారు.

ఉత్తరాన్ని గుర్తు చేద్దామని..

ప్రస్తుతం ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిళ్ల రూపంలో ప్రపంచం బాగా కుదించుకుపోయింది. ఈ క్రమంలో నేడు ఉత్తరాలు రాసేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. కేవలం సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం ట్రెండ్‌గా సాగుతోంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. అందుకే ఉత్తరాన్ని గుర్తు చేద్దామని తపాలాశాఖ తలచింది. 'ప్రియమైన నువ్వు ఓ ఉత్తరం పంపు' అన్న పేరుతో ఏటా పోటీలు నిర్వహించనుంది. వీటిపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి తపాలాశాఖ అడుగులు వేస్తోంది. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి తరానికి పరిచయం చేయడానికే తపాలాశాఖ లేఖా రచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెంట్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో 'ఢాయ్ ఆఖర్' పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

పంపాల్సిన చిరునామా

పోటీల్లో పాల్గొన్న వారు రాసిన ఉత్తరాన్ని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ-520013 చిరునామాకు లేదా సమీపంలో తపాలా కార్యాలయాలకు జనవరి 31వ తేదీ లోపు పంపాలి.

పోటీ ఎవరికి..

భారత దేశ పౌరులై 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరుస్తూ చేతితో రాసిన వ్యాసాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు, ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది.

ఉత్తరం రాయాల్సింది ఇలా..

- ది జాయ్ ఆఫ్ రైటింగ్‌లో భాగంగా ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అనే అంశంపై ఉత్తరం రాయాల్సి ఉంటుంది.
- హిందీ, ఇంగ్లీష్‌తో పాటు ఏ ప్రాంతీయ భాషలో అయినా లేఖ రాయవచ్చు
- కచ్చితంగా ఇన్‌లాండ్ లెటర్ లేదా ఎన్వలప్ కవర్‌లోనే రాసి పంపాల్సి ఉంటుంది
- ఎన్వలప్ కవర్‌లో రాసేవారు ఏ4సైజ్ తెల్ల కాగితంలో 1000 పదాలకు మించకుండా వ్యాసం పూర్తి చేయాల్సి ఉంటుంది
- ఇన్‌లాండ్ లెటర్‌లో రాసేవారు 500 పదాలకు మించకుండా వ్యాసం రాయాలి
- 18 ఏళ్ల లోపు వారు ఓ విభాగం, 18ఏళ్ల పైబడిన వారు మరో విభాగంగా విభజించారు.
- విద్యార్థులతో పాటు సాధారణ ప్రజానీకం సైతం పోటీలో పాల్గొనవచ్చు
- విద్యార్థులైతే జనన ధ్రువీకరణపత్రం జత చేయాల్సి ఉంటుంది.
- ఉత్తరం కవర్ మీద తప్పనిసరిగా వయసు రాయాలి.

భాగస్వాములు కావాలి



ఇటువంటి పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి. తపాలా శాఖ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి.

-సతీష్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్, పుత్తూరు.

నేడు జగనన్న జన్మదిన సంబరాలు



నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలో జననేత జగనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆ మేరకు నియోజకవర్గంలోని నారాయణవనం, సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండలాల్లో జరిగే జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొననున్నట్లు ఆయన వివరించారు.

గుడిమల్లం ఆలయానికి హాట్‌బాక్స్ బహూకరణ



హాట్ బాక్స్ అందజేస్తున్న శ్రీనివాసులు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి వారి నిత్యాన్నదాన పథకంలో భాగంగా అన్నం ఉంచుకోవడానికి 40 లీటర్ల హాట్ బాక్స్‌ను ఓ దాత బహూకరించారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లికి చెందిన ఎం.శ్రీనివాసులు దంపతులు హాట్ బాక్స్‌ను ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈఓ రామచంద్రారెడ్డికి అందజేశారు. వారికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

కల్యాణ మండపం నిర్మాణానికి సమాయత్తం

సత్యవేడు : పట్టణ సంత ప్రాంతంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి టీటీడీ అధికారులు మార్కింగ్ పనులు శుక్రవారం చేపట్టారు. తెలుగు గంగ స్థలంలో ఒక ఎకరా 20 సెంట్ల భూమిని అప్పటి కలెక్టర్ వెంకటరమణ టీటీడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి 2024 ఆగష్టులో ఎమ్మెల్యే ఆదిమూలం భూమి పూజ చేశారు. ప్రస్తుతం మార్కింగ్ ఇస్తూ పనులు చేపట్టేందుకు సమాయత్తం అయ్యారు.

ఊంజల్ సేవలో అమ్మవారు



ఊయలలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం : పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఊయల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున 4.30 గంటలకు తిరుప్పావై పాశురాల నివేదనతో పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను, ధనుర్మాస పూజలను పూర్తి చేశారు. నైవేద్య సమర్పణ అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాలను నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని అలంకరించి అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయల సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా జాతీయ వినియోగదారుల దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్‌ఎం

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం గుండేలిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ముని తిరుమలయ్య మాట్లాడుతూ ప్రతి వస్తువు కొనే ముందు తయారు తేదీ, గడువు తేదీ, నాణ్యత చూడాలని తెలిపారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెంచయ్య, మస్తాన్‌రావు, భాస్కరయ్య, మునీశ్వర్‌రెడ్డి, శ్రీకర్, జయసింహ పాల్గొన్నారు.

గొప్పవిజయాలతో ముందుకెళుతున్నాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గల్లా రామచంద్ర నాయుడు

ఘనంగా అమరరాజా 39వ వ్యవస్థాపక దినోత్సవం

రేణిగుంట: తమ సంస్థ 39 ఏళ్లుగా గొప్ప విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నామని అమరరాజా ఎండీ గల్లా జయదేవ్ అన్నారు. రేణిగుంట మండలంలోని అమరరాజా కర్మాగారం ఆడిటోరియంలో అమరరాజా గ్రూప్ సంస్థ 39వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరరాజా ఎండీ గల్లా జయదేవ్, వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి గొరినేని పాల్గొన్నారు. గల్లా జయదేవ్ మాట్లాడుతూ 1985లో అమర రాజా పవర్ సిస్టమ్స్‌గా కార్యకలాపాలను ప్రారంభించిన తమ సంస్థలో ప్రస్తుతం 6 కంపెనీలు, 17 వ్యాపారాలు, 18,500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. అమరరాజా బెటర్ వే అవార్డులకు ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి వారికి రూ.3 లక్షలు నగదు పురస్కారాలను అందజేశామన్నారు. ఈ ఏడాది తాము 3ఎక్స్ ఎక్సీడ్, ఎక్స్‌పాండ్, ఎక్సెల్ అనే నేపథ్యం స్వీకరిస్తున్నందున గత విజయాలను జరుపుకుంటున్నామన్నారు. 39 ఏళ్లలో గొప్ప విజయాలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సంస్థ అభివద్ధిలో ప్రతి కార్మికుడి కృషి ఉందన్నారు. అనంతరం ఎంబీటీ మొదటి అంధ విద్యార్థి శ్రీకాంత్ బొల్లా మాట్లాడారు. ఈ వేడుకల్లో హర్షవర్ధన్ గొరినేని, విక్రమాదిత్య గొరినేని, సిద్ధార్థ్ గల్లా, అశోక్ గల్లా, ఆపరేషన్స్ హెడ్ నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు శ్రీకాళహస్తి పట్టణం, రూరల్, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, ఏర్పేడు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేణిగుంట పరిధిలో..

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని గురవరాజుపల్లి, ఎలమండ్యం, గాజులమండ్యం, కురకాలవ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు నరికివేత తదితర మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈ రమేష్ బాబు తెలిపారు.

రెండు కార్ల ఢీ నలుగురికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వీఎం పల్లె వద్ద రెండు కార్లు ఢీకొనడంతో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన కృష్ణకిరణ్ తన మిత్రులతో కలిసి అరుణాచలానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో శ్రీకాళహస్తి పట్టణం వీఎం పల్లె వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కృష్ణకిరణ్‌తో పాటు అతని మిత్రులు ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రధాన సర్కిళ్ల వద్ద ఐమాక్స్ లైట్లు వేయండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఐమాక్స్ లైట్లను వేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని భక్తకన్నప్ప సర్కిల్ వద్ద ఆయన మాట్లాడుతూ దక్షిణ కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తి పట్టణానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలో పాలకమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని నంది సర్కిల్, భక్తకన్నప్ప సర్కిల్, శివయ్య సర్కిళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతాల్లో ఐమాక్స్ లైట్లు వేసేందుకు రూ.8 లక్షలను ఆలయం మంజూరు చేసిందన్నారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో బేస్‌మెంట్ పనుల వరకే ఆగిపోయాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తే మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని తెలిపారు. ఈ విషయంపై ఈఓ బాపిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సుబ్రహ్మణ్యం

సత్యవేడు : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించడానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం చిన్న ఈటిపాకం గ్రామంలో సర్పంచ్ గోవిందస్వామి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ..భూసమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో సర్వే నంబరు 0-90లోని నాలుగెకరాల శ్మశాన వాటిక భూమిలో పొందిన పట్టాను రద్దు చేయాలని కోరారు. అలాగే 304-2,3,4లో 27 ఎకరాల ప్రభుత్వ భూమి తమిళనాడుకు చెందిన ముత్తువాసి పేరు ఉందని ఆ పట్టాను రద్దు చేయాలన్నారు. పాలగుంటలోని శివాలయానికి దారి వసతి కల్పించాలని సర్పంచ్ కోరారు. గ్రామ పరిధిలోని చెరువుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి. మస్తాన్, పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఆర్‌ఐ సురేష్, మాజీ సర్పంచ్ శ్రీరాములు శెట్టి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షాలతో దెబ్బతిన్న ఉద్యాన పంటలు



కారణి గ్రామంలో కుళ్లిన టమాట పంట



గాజులపెళ్లూరులో దెబ్బతిన్న మిరప

బుచ్చినాయుడుకండ్రిగ : తుపాన్ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు ఉద్యాన పంటలైన మిరప, టమాట, కాకర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కనమనంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు, కారణి, కంచనపుత్తూరు గ్రామాల్లోని 150 ఎకరాలకు పైగా మిరప పంట దెబ్బతింది. కాపుకు వచ్చిన మిరప పంట దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కారణి గ్రామానికి చెందిన సునీల్‌రెడ్డికి చెందిన రెండెకరాల టమాట పంటలో నీరు నిలిచి పూర్తిగా దెబ్బతిని రూ.2 లక్షల నష్టం చేకూరింది. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

విమర్శలకు వేదికగా రెవెన్యూ సదస్సు



పెద్ద పాండూరులో మాట్లాడుతున్న తహసీల్దార్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేపై విమర్శలు చేసేందుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రెవెన్యూ సదస్సును వేదికగా మార్చుకున్నారు. రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నాస్వామిపల్లెలో తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో 29 విన్నతులు వచ్చాయి. హౌసింగ్, ఇంటి స్థలాలు, సర్వే సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెవెన్యూ సదస్సును గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించేందుకు ఎక్కువ సమయం కేటాయించారు. ప్రజల సమస్యలు తీర్చే బాధ్యతాయుత పదవిలో ఉండి ప్రతిపక్ష పార్టీ నాయకులను దూషించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే ప్రసంగం సాగడాన్ని చూసిన పలువురు బహిరంగంగానే విమర్శల వర్షం కురిపించారు. సదస్సులో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, ఈఓపీఆర్డీ ప్రభురావు, సర్పంచ్ సుశీలమ్మ, నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక నాయకులకు ఎమ్మెల్యే వార్నింగ్

ఎవరైనా తన పేరు చెప్పుకుని ఇసుక అక్రమ రవాణా చేస్తే తాటతీస్తానంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్థానిక నాయకులకు వార్నింగ్ ఇచ్చాడు. రేణిగుంట మండలంఅన్నాస్వామిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సు ముగిసన అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ తన మనుషుల ద్వారా నిఘాగా ఉంచి తానే 17 ట్రాక్టర్లు ఒక జేసీబీని అధికారులకు పట్టి ఇచ్చానన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా తన పేరు చెప్పుకుని ఇసుక అక్రమ రవాణా, ఇతర అవినీతి పనులు చేస్తే సహించేదని తెలిపారు. ఎమ్మెల్యే టోల్ ఫ్రీ నంబర్‌కు అలాంటి వారిపై ఫిర్యాదు చేయాలని కోరారు.

వరదయ్యపాళెం : గ్రామ స్థాయిలో సుదీర్ఘ కాలంగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్ద పాండూరులో నిర్వహించిన సదస్సులో పలువురు మ్యుటేషన్లకు సంబంధించి అర్జీలు అందజేశారు. అలాగే నూతన పింఛన్లు, గృహాల మంజూరుకు సంబంధించి వినతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కవిత, ఎంపీటీసీ అంకమ్మ, ఆయకట్టు చైర్మన్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

బాలకార్మికులుంటే చర్యలు



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

శ్రీకాళహస్తి: దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ గోపి అన్నారు. పట్టణంలోని పలు దుకాణల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఐడీ ప్రారంభించిన ఆపరేషన్ స్వేచ్ఛ ఫేస్-4 చైల్డ్ లేబర్ రిస్క్‌లో భాగంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్‌మాళ్లను అధికారుల తనిఖీ చేశారు. ఇందులో నలుగురు బాల కార్మికులను గుర్తించారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని, అలా పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మనోహర్, హెడ్ కానిస్టేబుల్ రఘు, కార్మికశాఖ అధికారులు చిన్నలాలెప్ప, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు వైన్‌షాపు దారి ఫ్లెక్సీ



పంచాయతీ బోరుకు కట్టిన మద్యం దుకాణ దారి ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ప్రజలకు మంచి నీరు అందించే పంచాయతీ మంచినీటి బోరుకు వైన్‌షాప్ ఫ్లెక్సీని కట్టడం చర్చనీయంగా మారింది. రేణిగుంటలోని పారిశ్రామిక వాడ సమీపంలోని పంచాయతీ మంచినీటి బోరుకు పసుపు పచ్చరంగును కొట్టడమే కాక బోరుకు మద్యం దుకాణానికి దారి సూచించే ఫ్లెక్సీని కట్టారు. కూటమి నాయకులు నిర్వహించే మద్యం అయినందునే పంచాయతీ బోరుకు బ్యానర్ కట్టినా ఎవరు అడగడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.